## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

దేవరకొండ : దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఆంగ్ల అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులు ఉన్న వారు అర్హులని తెలిపారు. పీహెచ్‌డీ, ఎన్ఈటీ, ఎస్ఈటీలతో పాటు బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

### 29న ఉచిత వైద్యశిబిరం

కొండమల్లేపల్లి : దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లిలో ఈనెల 29న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ తెలిపారు. శుక్రవారం అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటితో కలిసి ఆమె మాట్లాడుతూ కొండమల్లేపల్లిలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీరి వెంట బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పస్నూరి యుగేందర్‌రెడ్డి తదితరులున్నారు.

### గుడిపల్లి ఎస్ఐగా రంజిత్‌రెడ్డి



పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి ఎస్ఐగా అబ్బు రంజిత్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న వీరబాబు వీఆర్‌కు బదిలీకాగా వీఆర్‌లో ఉన్న రంజిత్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు.

### బీజేపీ కన్వీనర్‌గా మల్లికార్జున్



త్రిపురారం : బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఐటీ, సోషల్ మీడియా విభాగం నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా త్రిపురారం మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు కటకం మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ ఐటీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా నియామక పత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా కటకం మల్లిఖార్జున్ మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ నాయకులు కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

### నిరుపేద కుటుంబానికి బాసటగా నిలిచిన ఎంపీపీ

కొండమల్లేపల్లి : సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబానికి బాసటగా ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి నిలిచారు. మండలంలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన వంపు వెంకటయ్య కుటుంబం పూరిగుడిసెలో నివాసం ఉంటుంది. ఇది గుర్తించిన ఎంపీపీ తమ సొంత నిధులతో ఇంటి నిర్మాణానికి ఎంపీపీ ముందుకొచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ ఏకుల సురేష్, సేవాలాల్ తదితరులు పాల్గొన్నారు.

### 'బేటీ బచావో బేటీ పడావో'పై అవగాహన

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పడావోపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీడీఎస్ కొండమల్లేపల్లి ప్రాజెక్టు అధికారి సరళ మాట్లాడుతూ బాలికలు, మహిళలు ఆత్మస్థైర్యంతో అన్నిరంగాలలో ముందుండాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మల్లేష్, సూపర్‌వైజర్‌లు మంజుల, రజిత, తారకమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'పరీక్ష పే చర్చా'పై విద్యార్థులకు అవగాహన

చింతపల్లి : మండల కేంద్రంలోని మాతృశ్రీ పాఠశాల, ఆదర్శ మోడల్ పాఠశాలలో శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొన్న 'పరీక్ష పే చర్చా' కార్యక్రమంపై బీజేపీ నాయకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి చనమోని రాములు మాట్లాడుతూ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులనుద్దేశించి నిర్వహించిన పరీక్ష పే చర్చా కార్యక్రమంలో తగు సూచనలు, సలహాలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డు మహేశ్, గొడుగు శ్రీనివాస్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆలిండియా సమతా సైనిక్ దళ్ సభ్యత్వ నమోదు

దేవరకొండ : పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గ్రంథాలయంలో శుక్రవారం ఆలిండియా సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు మద్దిమడుగు భిక్షపతి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆలిండియా సమతా సైనిక్ దళ్‌ను బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏకుల రాజారావు, జిల్లా ఉపాధ్యక్షులు ఏకుల సురేష్, బర్పటి వెంకటయ్య, లక్ష్మీనారాయణ, సాయి, అంబేద్కర్, పరమేశ్ పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు వివిధ రంగాల కార్మికులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక పాత్ర పోషించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏపల్లి ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, పస్నూరు యుగంధర్‌రెడ్డి, కేసాని లింగారెడ్డి, వల్లపురెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధికి కృషి**

చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం 'మన ఊరు – మన ప్రభుత్వం – మన పథకాలు' కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బోటిమీదితండాలో రూ.20లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, రూ.20లక్షలతో చేపడుతున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. రైతు సంక్షేమం కోసం 24 గంటల విద్యుత్, రైతు బీమా, రైతు బంధు, సిసి రోడ్ల నిర్మాణం, పల్లె ప్రకృతి వనాలు, చెత్త సేకరణకు ట్రాక్టర్లను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో రైతు వేదికలను నిర్మించిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, సర్పంచ్ నేనావత్ జ్యోతి, ఎంపీటీసీ నేనావత్ సునీత, ఉప సర్పంచ్ కిషన్‌నాయక్, నట్వ గిరిధర్, మాస భాస్కర్, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వింజమూరి రవి, అక్రంయాదవ్, ఎండి.ఖాలెద్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ : పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్



చింతపల్లి : బోటిమీదితండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

# గంగాధర్ సేవలు మరువలేనివి

• శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులు తిరునగర్ గంగాధర్ మిర్యాలగూడ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివి అని ఎమ్మెల్సీ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావులు అన్నారు. శుక్రవారం తిరునగర్ గంగాధర్ 3వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద గల గంగాధర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఆగ్రోస్ డవలప్‌మెంట్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మోసిన్, కౌన్సిలర్ నిరంజన్‌రెడ్డి, ఎండి.షోయబ్ తదితరులున్నారు.

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో**

కాంగ్రెస్ నాయకుడు దివంగత తిరునగరు గంగాధర్ 3వ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. గంగాధర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు రవినాయక్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.



తిరునగరు గంగాధర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సుఖేందర్‌రెడ్డి, భాస్కర్‌రావు

# సీఎం కేసీఆర్ అండతోనే అభివృద్ధికి నిధులు

• ఎమ్మెల్యే నోముల భగత్

త్రిపురారం : సీఎం కేసీఆర్ అండతోనే నాగార్జున సాగర్ నియోజక వర్గంలో గ్రామాల అభివృద్ధికి నిధులు వస్తున్నాయని, ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో మోడల్ స్కూల్‌లో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ వారి రూ. 2కోట్ల ఆర్థిక సహకారంతో నిర్మించనున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మోడల్ స్కూల్‌లో రూ. 12 లక్షలతో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం త్రిపురారం గ్రామంలో రూ. 20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రైతువేదికలో నిర్వహిస్తున్న కంటి వెలుగు సెంటర్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండల వ్యాప్తంగా గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ పథకం ద్వార మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ మాట్లాడారు. పాఠశాలకు డాక్టర్ రెడ్డిస్ ల్యాబ్ వారు రూ. 2 కోట్లు ఆర్థికసాయం చేయడంతో ల్యాబ్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మ, జెడ్పీటీసీ ధనావత్ భారతీ, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రా రెడ్డి, రెడ్డీ ల్యాబ్ హెడ్ నారాయణ రెడ్డి, వీర స్వామి, సర్పంచ్‌లు, అనుముల శ్రీనివాస రెడ్డి, కలగాని శ్రవన్ కుమార్, ఆడివయ్య, ఎంఈఓ బాలాజీ నాయక్, తహసీల్దార్ కేసీ ప్రమీలా, బీఆర్ఎస్ అధ్యక్షుడు నరేందర్, కామర్ల జానయ్య, పెద్దబోయిన శ్రీనివాస్, రామ చంద్రయ్య, బైరం క్రిష్ణ, మాధా ధనలక్ష్మి, వెంకటాచారి, జంగిలి శ్రీనివాస్, రవి నాయక్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీలో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్, తదితరులు

## మైనార్టీలకు క్షమాపణ చెప్పాలి

త్రిపురారం : మైనార్టీలను కించపరిచినట్లు మాట్లడిన జెడ్పీటీసీ భర్త ధనావత్‌భాస్కర్ వారికి క్షమాపణ చెప్పాలని రాగడప బీఆర్ఎస్ మైనార్టీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండ కేంద్రంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బహునూతుల నరేందర్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన మైనార్టీలను భాస్కర్ నాయక్ కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశాడని ఆరోపించారు. రాగడపలో కాంగ్రెస్ పార్టీని వీడి సాగర్‌లో ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక వాస్తవ మన్నారు. కాంగ్రెస్ నాయకులు కావాలనే ఎమ్మెల్యే నోముల భగత్‌ను విమర్శించడం తగదని, కాంగ్రెస్ నాయకులకు రాగడపలో కమిటీ వేయడానికి కార్యకర్తలు లేక తిరిగి వెళ్లి విచిత్రంగా ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

# అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి



వేములపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : వేములపల్లి మండల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం ఎస్‌డీఎఫ్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.2.20కోట్లతో మొల్కపట్నం, బుగ్గబావిగూడెం, శెట్టిపాలెం, వేములపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. వేములపల్లిలో నెలకొన్న సమస్యల పరిష్కరిస్తానని మండల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, వైస్ ఎంపీపీ గోవర్ధని, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు మల్లయ్యయాదవ్, అనిరెడ్డి నాగలక్ష్మీ, మజ్జిగపు పద్మ, నాయకులు మల్లేష్‌గౌడ్, గౌరు శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

దేవరకొండ : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని రెండో వార్డు కాంగ్రెస్ కమిటీ ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 7నుంచి దేవరకొండ నియోజకవర్గంలో చేపట్టనున్న ×హాథ్‌సే హాథ్ జోడో≡ యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం వార్డు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంకూరి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కంచు వెంకటయ్య, అంకూరి శివరాజు, కార్యదర్శులుగా అరుణ్, తిరుపతయ్య, అంజయ్యలతో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు వేణుధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు యూనూస్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, పాపానాయక్, మాతంగి శ్రీను, సుగుణయ్య, వీరయ్య, అశోక్, నంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలూనాయక్

# అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం



కొండమల్లేపల్లి : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ, తదితరులు

కొండమల్లేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దేవరోనితండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇస్లావత్ రాకేశ్, గ్రామ కార్యదర్శి కిరణ్, జన సేన పార్టీ నాయకులు చందునాయక్, ఆప్తాల్మిక్ మహేశ్, డీఈఓ రమావత్ విక్కి రాథోడ్, సూపర్‌వైజర్ రాణి, ఏఎస్ఎం లలిత, శ్రీదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర : అంధత్వ నివారణే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తెప్పలమడుగులో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పలు అభివృద్ధి పథకాలు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్ను సుందర్‌రెడ్డి, గురువయ్య, సర్పంచ్ లక్ష్మమ్మ, నడ్డి లింగయ్య, శంకర్, లక్ష్మణ్, ఎల్లమ్మ, తరి పెద్దులు, చెన్నయ్య, రాజశేఖర్, నాగరాజు, నాగయ్య, కృష్ణయ్య, రామాంజీ పాల్గొన్నారు.

దేవరకొండ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మున్సిపాల్టీ పరిధిలోని అన్ని వార్డులో ముందుగా నిర్దేశించిన తేదీల వారిగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరం ఉన్న వారికి ఉచితంగా ప్రభుత్వం కళ్ల అద్దాల పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రహత్‌అలీ, కౌన్సిలర్ రజియాసుల్తానా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణలో బడుగు, బలహీన వర్గాల పేదలందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాపూజీనగర్‌లో 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ విద్య కోసం బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యను అందించేందుకు కోట్లాది రూపాయలను కేటాయించి అన్ని మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర కోటేశ్వర్‌రావు, స్థానిక కౌన్సిలర్ నాగలక్ష్మి, ఎంఈవో బాలాజీనాయక్, మాజీ కౌన్సిలర్ సందేశీ ఆంజనేయరాజు, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

**ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి**

మిర్యాలగూడ : ప్రభుత్వ బడుల బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తుందని రాష్ట్ర ఆగ్రో కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు ఆలగడపలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ×మన ఊరు – మన బడి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే నిరుపేద వర్గాల విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన అన్ని సౌకర్యాలు కల్పించడానికి సీఎం కేసీఆర్ నిధులు వెచ్చిస్తున్నారన్నారు. వేసవి సెలవుల అనంతరం అన్ని పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణ, నాయకులు రావూరి రవి, పంచాయతీరాజ్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఎంఈవో బాలాజీనాయక్, ఏఈఈ ఆదినారాయణ, ప్రధానోపాధ్యాయులు కొత్త రాఘవేంద్ర, ప్రసాద్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.



గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న తిప్పన విజయసింహారెడ్డి

## బంజారా కుంభమేళాకు తరలిన లంబాడీలు

పెద్దవూర : అఖిల భారత బంజారా కుంభమేళాకు బయలుదేరి వెళ్తున్న బస్సులకు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి శుక్రవారం మండల కేంద్రంలో కొబ్బరికాయ కొట్టి జెండా ఊపి ప్రారంభించారు. మహారాష్ట్రలో నిర్వహించే శ్రీబాలాజీ భగవాన్ ప్రసాద స్వీకరణకు, శ్రీసంత్ సేవాలాల్ ఆశీస్సుల కోసం నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి బంజారా నాయకులు మూడు బస్సుల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్‌యాదవ్, గురువయ్యయాదవ్, స్థానిక సర్పంచ్ నడ్డి లింగయ్య, నాయకులు రమావత్ రవినాయక్, దినేషనాయక్, పాల్తీ శంకర్, పాండు తదితరులు పాల్గొన్నారు.



పెద్దవూరలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

# పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

దేవరకొండ : విద్యార్థినులు పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు కోరారు. శుక్రవారం దేవరకొండలోని బీసీ బాలికల వసతి గృహంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు సైదులు ఆధ్వర్యంలో విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వసతిగృహం వార్డెన్ రేణుక, ఏఐఎస్ఎఫ్ నాయకులు బొడ్డుపల్లి అర్జున్, తేరటి పవన్,శివ, కిరణ్, మధు పాల్గొన్నారు.

**ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి**

పెద్దఅడిశర్లపల్లి : విద్యార్థులు క్రమ శిక్షణతో కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సీఎస్ ఫౌండేషన్ చైర్మన్ గోలి గిరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేశ భవిష్యత్‌కు సామాజిక బాధ్యతపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన నారాయణదాసు శ్రీను అనారోగ్యంతో మృతి చెందడంతో శ్రీను కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఎస్ఓ సరళ, సీఎస్ ఫౌండేషన్ సభ్యులు గోలి శ్యామ్, ఈశ్వర్, నితిన్, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.



దేవరకొండ : విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న ఆంజనేయులు

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కొండమల్లేపల్లి : విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆలిండియా సమతా సైనిక్ దళ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మద్దిమడుగు భిక్షపతి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని చింతకుంట్ల గ్రామంలోని గ్రంథాలయాన్ని సందర్శించి మాట్లాడారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. ఆయన వెంట యేకుల సురేష్, ఆంజనేయులు, హరికృష్ణ, నాగేశ్, సహదేవ్, అంజి, నాగార్జున, రవి పాల్గొన్నారు.



గ్రంథాలయంలో బుక్స్ చదువుతున్న విద్యార్థులు

# మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పిస్తాం



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ కౌన్సిల్ ఫోరం జిల్లా చైర్మన్ వర్ర వెంకట్‌రెడ్డి

హాలియా : హాలియా మున్సిపాలిటీ పట్టణంలో ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని మలిదశ ఉద్యమకారుడు, తెలంగాణ మున్సిపల్ కౌన్సిల్‌ఫోరం జిల్లా చైర్మన్ వర్ర వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 11వ వార్డులో 4లక్షల 40వేలతో నిధులతో నిర్మిస్తున్న సీసీ డ్రెయినేజీ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ సాగర్ ఉప ఎన్నికల సమయంలో హాలియా మున్సిపాలిటీ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతుందన్నారు. మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు.

## కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని గుడపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా జానపాటి రామలింగం, ప్రధాన కార్యదర్శిగా భూతం సైదులు, ఉపాధ్యక్షుడు వడ్లపల్లి మల్లారెడ్డి, కోశాధికారిగా మల్లేష్, భూత్ కమిటీ అధ్యక్షుడిగా లింగయ్య, యువజన కమిటీ అధ్యక్షుడిగా శ్రీరాములు, బీసీ సేల్ అధ్యక్షుడిగా గణపురం శ్రీను, ఎస్సీ సేల్ అధ్యక్షుడిగా మహేష్‌లతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక జిల్లా నాయకులు ఏవీరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, రుక్మారెడ్డి, భద్రయ్య పాల్గొన్నారు.

# సమన్వయంతో మండల అభివృద్ధికి కృషిచేయాలి

మిర్యాలగూడ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషిచేయాలని మాడ్గులపల్లి ఎంపీపీ పోకల శ్రీవిద్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. విద్యుత్, తాగునీరు, రహదారుల మరమ్మతుల కోసం ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ సమావేశానికి హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీవిద్య

# సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య వాగ్వాదం

• పోలీస్ స్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదు

డిండి : డిండి పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్న సమయంలో సర్పంచ్, ఉపసర్పంచ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అంతేగాక ఒకరిపై ఒకరు దాడి చేసుకోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇరువురు శుక్రవారం ఫిర్యాదు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, పోలీసులు, పలువురు పంచాయతీ పాలకవర్గం సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతినెలా నిర్వహించినట్లుగానే శుక్రవారం కూడా డిండి పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చ జరిగింది. ఇందులో భాగంగా ఈనెల 26న గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన గణతంత్ర వేడుకలకు తనకు సమాచారం ఇవ్వలేదని ఉపసర్పంచ్ నూకం వెంకటేశ్ సమావేశం దృష్టికి తీసుకురావడంతో పాటు గ్రామ కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. దీంతో ఉప సర్పంచ్‌కు ఈనెల 25న కార్యాలయ సిబ్బంది ద్వారా ఆహ్వానం పంపానని, సమాచార రికార్డులో సంతకం చేయకుండా తనను ఆహ్వానించ లేదనడం ఉపసర్పంచ్‌కు సరైనది కాదని పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా పంచాయతీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు విత్ డ్రా కొరకు ఉపయోగించే పెండింగ్ చెక్కులపై సంతకం చేయకుండా ఉప సర్పంచ్ ఇబ్బందికి గురి చేస్తున్నాడని సర్పంచ్ సాయమ్మ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య మాటా మాటా పెరగడంతో ఇరువురు వాగ్వాదానికి దిగారు. దీంతో మహిళ సర్పంచ్‌పై ఉప సర్పంచ్ నూకం వెంకటేష్ వాగ్వాదానికి దిగడం ఏమిటని కార్యాలయం బయట ఉన్న సర్పంచ్ భర్త మేకల కాశన్న లోపలికి రావడంతో గొడవ మరింత పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. మహిళా సర్పంచ్‌పై ఉపసర్పంచ్ వెంకటేశ్ చేయి చేసుకున్నాడని సర్పంచ్ సాయమ్మ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా తాను పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతుండగా అనవసరంగా జోక్యం చేసుకోని సర్పంచ్ భర్త కాశన్న, కుమారు శివ తనపై దాడి దిగారాని ఉపసర్పంచ్ నూకం వెంకటేశ్ ఫిర్యాదు చేశారు.